క్లుప్తంగా

మాండవ్య నారాయణుని గ్రామోత్సవం



సామర్లకోటలో సాగుతున్న గ్రామోత్సవం

సామర్లకోట: అతిపురాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణుని గ్రామోత్సవం ఆదివారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో సాగింది. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం స్వామివారితో పాటు శ్రీదేవి, భూదేవిలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయం నుంచి ఫ్లై ఓవర్ వంతెన మీదుగా వెళ్లిన గ్రామోత్సవం ఆలయానికి చేరింది. స్వామి వారు తమ ఇళ్ల వద్దకు రావడంతో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రైలు ప్రమాద బాధితులను ఆదుకోవాలి

సామర్లకోట: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను కేంద్రప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా ప్రజా నాట్యమండలి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం సాయంత్రం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. సీపీఎం జిల్లా నాయకుడు కరణం ప్రసాదరావు మాట్లాడుతూ ప్రమాదంలో 273 మంది మృతి చెందడం దారుణమని అన్నారు. ప్రజా నాట్యమండలి నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కౌన్సెలింగ్



మైనర్ బాలురకు డ్రైవింగ్‌పై కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సైలు సునీత, గరగారావు

సామర్లకోట: రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఆదివారం పోలీసులు వాహన చోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మోటారు సైకిళ్లపై ముగ్గురు నుంచి ఐదుగురు వరకు ప్రయాణం చేయడం, మైనర్ బాలుర డ్రైవింగ్, రేస్ అండ్ స్పీడ్ డ్రైవింగ్‌లతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సునీత, ఆడపా గరగారావు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక 20వ వార్డులోని నీలమ్మ చెరువు వద్ద ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద సోమవారం ఉదయం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు చిట్టుమాని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక విజన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



వేసవి శిక్షణలో భాగంగా బాస్కెట్ బాల్ ఆడిస్తున్న విమలారాణి

పెద్దాపురం: విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని మరింత పెంచుకోవాలని ఉపాధ్యాయిని వాడపల్లి విమలారాణి అన్నారు. ఆదివారం శాఖా గ్రంథాలయంలో సిబ్బంది సింగం బుల్లియ్య అధ్యక్షతన జరిగిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడుతూ శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ తరగతులు దోహదపడతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సాహించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు.

బదిలీల్లో ఖాళీగా ఉన్న పీడీ పోస్టులను చూపండి

నాగమిల్లితోట జంక్షన్: 117 జీఓ ప్రకారం పాఠశాలల్లో పెరిగిన స్కూల్ అసిస్టెంట్ పీడీ పోస్టులను ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో ఖాళీలుగా చూపాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.జార్జి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు పాఠశాల కమిషనర్‌కు ఒక వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పీడీ పోస్టులు పెరిగాయని, అలాగే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న చోట ఆ పోస్టులు రద్దయ్యాయని అన్నారు. బదిలీల్లో ఈ ఖాళీలు చూపకపోతే సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందన్నారు.

గోదారినీరొచ్చేనా!

- అధికారుల సమన్వయ లోపంతో కలుషిత నీటి సరఫరా
- సముద్రంలోకి వ్యర్థ జలాల తరలింపులో తీవ్ర జాప్యం
- డీఈఈ ఆదేశాల కోసం ఎదురుచూపు

సామర్లకోట: గోదావరి కాలువ వచ్చిందనే ఆనందం పట్టణ ప్రజలకు ఏమాత్రం మిగల్లేదు. స్థానిక నాగార్జున చెరువులో గోదావరి జలాలను నింపి వాటిని ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌లో వడగొట్టి ప్రజలకు అందజేయాలన్నది ప్రణాళిక. అయితే నాగార్జున చెరువులో నీటిమట్టం తగ్గిపోయి నెల రోజులుగా మున్సిపల్ కుళాయిల నుంచి నుంచి తాగునీరు ఆకుపచ్చగా వస్తోంది. గోదావరి జలాలు వస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు చెప్పినప్పటికీ సమస్య అలాగే ఉంది. గోదావరి జలాలు వచ్చే ముందు ఏటా మురుగునీటిని సముద్రంలోకి విడిచిపెట్టే బాధ్యత ఇరిగేషన్ అధికారులదే. కానీ గోదావరి జలాలు వచ్చి మూడు రోజులైనా ఆ పని జరగలేదు. సామర్లకోట లాకుల గేట్లు తీయక పోవడంతో వ్యర్థ జాలాలతో గోదావరి కాలువ నిండిపోయింది. ఉన్నతాధికారులు ఆదేశిస్తే తప్ప గేట్లు తీయలేమని లాకుల సిబ్బంది చెప్తున్నారు. ఈ నేపథ్యంలో గోదావరి జలాలు నాగార్జున చెరువులోనికి రాకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు. గోదావరి జలాలే సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీలతో పాటు కాకినాడ ప్రజలకూ తాగునీటి అవసరాలు తీరుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇరిగేషన్ డీఈఈ ఆదేశాలు లేనిదే తాము ఏమీ చేయలేమని లాకుల సూపరింటెండెంట్ కరణం సత్యనారాయణ అంటున్నారని మున్సిపల్ అధికారులు చెప్తున్నారు. ఇక గోదావరి జలాలు వచ్చి ప్రయోజనం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



కలుషిత జలాలతో నిండిపోయిన గోదావరి కాలువ



మూసిఉన్న సామర్లకోట లాకులు



సామర్లకోటలోని ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

వ్యర్థ జలాలను సముద్రంలోకి తరలిస్తాం



గోదావరి కాలువ, నాగార్జున చెరువు, చెరువలోనికి నీరు వచ్చే కాలువలను, ఫిల్టర్ బెడ్‌ను కూడా ఆదివారం పరిశీలించాం. నీరు నల్లగా ఉంది. వ్యర్థ జలాలను సముద్రంలోకి వదిలే ఏర్పాట్లు చేస్తాం. గోదావరి కాలువలో స్వచ్ఛమైన నీరు వచ్చిన తరువాతే నాగార్జున చెరువును నింపుతాం. – జి.రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు



ఎండపల్లిలోని పంట పొలాల్లో మట్టి తవ్వకాలు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ, పంచాయతీ పరంగా ఎటువంటి అనుమతులు పొందకుండా పచ్చని పొలాలను తవ్వేస్తున్నారు. గ్రామ, మండలస్థాయిలో అధికారులకు ముడుపులు అందడంతో అక్రమ మట్టి తవ్వకాలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని పిఠాపురం-ఉప్పాడ రోడ్డలోని ఎత్తు తూము సమీపంలోని మెరక దిబ్బ, గోర్సలోని కాలువ గట్లు, నాగులాపల్లి, రమణక్కపేటలో పంట పొలాల్లో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతన్నాయి. పొలాల మెరక, పల్లాలు పేరుతో రాత్రి, పగలు తేడా లేకుండా మట్టిని తవ్వి ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా తవ్విన ఈ మట్టిని వ్యాపారులు ఇటుక బట్టీలు, లే అవుట్లకు తరలించి రూ.లక్షల్లో సొమ్ములు చేసుకుంటున్నారు. ఎవరైనా ఈ తవ్వకాలకు అడ్డు వస్తే మామూళ్లు ముట్టజెప్పుతున్నారనే ఆరోపణలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. మట్టిని తరలించే ట్రాక్టర్లు గ్రామాల్లో అధిక వేగంతో వెళ్లడం వలన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల రమణక్కపేటలో మట్టి లోడుతో వెళుతున్న ట్రాక్టర్ మహిళలను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయాన్ని బయటకు రాకుండా గోప్యంగా ఉంచారు. దీనిపై తహసీల్దార్ ప్రసాద్‌ను వివరణ కోరగా రెవన్యూ పరంగా ఎటువంటి అనుమతులు లేవని, అనుమతులు లేకుండా మట్టి తవ్వితే బాధ్యలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా ఏరువాక పౌర్ణమి



ఆలయంలో ఏరువాక పౌర్ణమి పూజ చేస్తున్న అభిషేక పండితులు

సామర్లకోట: బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈ మేరకు దాత జి.బాలసూర్య శివశ్రీ దంపతులు అమ్మవారికి వెండి గంట, శ్రీచక్రం, హారతి పళ్లెం బహుమతిగా సమర్పించారు. పిఠాపురం దేవస్థానం ఈఓ చీమలకొండ వెంకటరమణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఏరువాక దుక్కి దున్నిన ఎమ్మెల్యే

ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప దుక్కి దున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని, అధిక దిగుబడులతో రైతులకు మంచి లాభాలు రావాలని, గోమాత, భూమాత, ప్రకృతి మాతలకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

చురుగ్గా కోనేటి పూడిక తీత



సామర్లకోట పంచారామ క్షేత్ర కోనేరులో సాగుతున్న పూడికతీత పనులు

సామర్లకోట: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయ కోనేరులో పూడిక తీత పనులు జోరుగా జరుగుతున్నాయి. ఎంపీ వంగా గీత చొరవతో కేంద్ర పురావస్తు శాఖ అధికారులు పూడిక తీత, అభివృద్ధి పనులకు రూ.33 లక్షలు మంజూరు చేశారు. ఇటీవల భారీ వర్షాలు కురియడంతో కోనేరులో చేరిన నీటిని జేసీబీల ద్వారా నీటిని బయటకు తోడుతున్నారు.

బయటి పనులకు మట్టి తరలింపు..

అలాగే కోనేటిలోని మట్టిని ఆలయ అవసరాలకు వినియోగించాల్సి ఉండగా బయటి వ్యక్తులకు ఇస్తున్నారని ట్రస్టు బోర్డు సభ్యుడు చల్లా సత్తిబాబు ఆరోపిస్తున్నారు. పురావస్తు శాఖ అధికారులపై ఒత్తిడి చేస్తే ఆలయానికి చెందిన విశ్రాంతి భవనం ఆలయం వద్ద కొంత మట్టి వేశారని, తిరిగి బయటకు వ్యక్తులకు తరలిస్తున్నారన్నారని తెలిపారు. విశ్రాంతి భవనం వద్ద ఆవరణ గోతులతో నిండిపోయిందని, దానిని నింపేందుకు సుమారు 500 ట్రాక్టర్ల మట్టి కావలసి ఉంటుందని ఆయన తెలిపారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పంచారామ క్షేత్ర కోనేరులో జరుగుతున్న పూడికతీత పనులను సోమవారం పరిశీలించి చెరువులో మట్టి బయటకు తరలించకుండా చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు పురావస్తు శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడతా. చెరువులోని మట్టిని ఆలయం వద్ద మాత్రమే ఉపయోగించేలా చర్యలు తీసుకుంటాం. – దవులూరి దొరబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్

వైభవంగా పాదాంబిక అమ్మవారి జాతర



పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో వేంచేసిన పాదాంబిక అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. 108 మంది మహిళలు అమ్మవారికి సహస్ర ధారాభిషేకం, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని మల్లెపూలు, గులాబీలు, సంపంగి పూలతో అలంకరించి కవాట బంధనం చేశారు. సోమవారం తెల్లవారుజామున తిరిగి అమ్మవారి గర్భాలయాన్ని తెరచే సమయానికి సుగంధ పరిమళాలు వెదజల్లుతూ అమ్మవారు భక్తులకు దర్శమిస్తారని పండితులు తెలిపారు. కవాటబంధనం చేసిన అమ్మవారిని దర్శించుకుంటే అఖంగ సౌభాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. అమ్మవారికి అలంకరించిన పూలను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేయడం ఇక్కడి ఆనవాయితీ. జాతర సందర్భంగా ఆదివారం రాత్రి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి.

ఘనంగా మాదాలమ్మతల్లి తీర్థం

కొత్తపల్లి: మండలంలోని గోర్సలో వేంచేసిన మాదాలమ్మతల్లి తీర్థం ఆదివారం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గరగ నృత్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయం, పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. గోర్స, కొమరగిరి, పండూరు తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ రొంగల వీరబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

వర్షంతో ఉపశమనం



పిఠాపురం మండలం నవఖండ్రవాడలో పిడుగు పడి కాలిపోతున్న చెట్టు

పిఠాపురం: వేసవి తాపంలో అల్లాడుతున్న ప్రజలు ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచి వడగాడ్పులు, ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఒక్క సారిగా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలలతో వర్షం కురిసింది. ఈదురుగాలుల బీభత్సానికి ప్రజలు హడలిపోయారు. గత వారం రోజులుగా సూరీడు నిప్పులు చెరగడంతో ఇళ్లకే పరిమితమైన జనం వాతావరణం చల్లబడడంతో ఆనందం వ్యక్తం చేశారు. పిఠాపురం గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో చిన్న పాటి జల్లులు పడగా ఆకాశం కారుమబ్బులతో నిండిపోయి ఆహ్లాద వాతావరణం నెలకొంది. పిఠాపురం మండలం నవఖండ్రవాడలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో చెట్టు కాలిపోయింది.

కరాటే క్రీడాకారులకు సత్కారం



క్రీడాకారులతో చైర్‌పర్సన్ అరుణ తదితరులు

సామర్లకోట: ఇటీవల విశాఖలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను లయన్స్ క్లబ్ భవనంలో అభినందించారు. కోచ్ శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ పాల్గొని క్రీడాకారులను, కోచ్ శంకర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కోచ్‌లు శంకర్, బద్రి, కామేష్, ప్రసన్న, భద్రరావులను చైర్ పర్సన్, వైస్‌చైర్మన్లు సత్కరించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, భారతమాత సేవా పరిషత్ అధ్యక్షుడు గౌరకపూడి చిన్నయ్యదొర, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్.సుధారాణి, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గుండు శంకరరావు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, బాస్కెట్‌బాల్ కోచ్ ఐ.గోపాలకృష్ణ, కౌన్సిలర్ రెడ్డి లోవకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టోర్నీలో ద్వితీయ స్థానం సాధించిన క్రీడా కారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కార్మికులకు వేసవి భత్యం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంబాల సతీష్

కాకినాడ సిటీ: పరిశ్రమల్లో పని చేసే కార్మికలకు నెల వేతనంతో పాటు 30 శాతం అదనంగా వేసవి భత్యం ఇవ్వాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. ఆదివారం కాకినాడ ఏఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న నేపథ్యంలో వేసవికాలం అంతటా ఉమ్మడి జిల్లాలో వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలల కాలానికి నెలవారి వేతనంతో పాటు అదనంగా 30 శాతం సమ్మర్ అలెవెన్స్‌లు ఇవ్వాలని యాజమాన్యాలను డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల సతీష్, జిల్లా కమిటీ సభ్యులు డి నారాయణమూర్తి, ఎం నాగమణి, వివిధ పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ప్రిన్సిపాల్ తిరుపాణ్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం పేర్కొన్నారు. రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, బీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పర్యావరణ పరిరక్షణ పోటీలు నిర్వహించారు. 48 పాఠశాలల నుంచి 321 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ చూపిన వారికి ఎంఎల్‌సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ బహుమతులు అందజేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్, జిల్లా కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, షేక్ అహ్మద్, అలపాటి శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినిల్ పాల్గొన్నారు.

పంచభూతాలను కలుషితం కానీయొద్దు



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ ఉమర్ ఆలీషా, డీఎస్పీ వెంకటేశ్వరరావు

- ఆధ్యాత్మిక గురువు ఉమర్ ఆలీషా
- ఉత్సాహంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

కాకినాడ రూరల్: ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి పంచభూతాలు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని విశ్వ విజ్ఞాన విద్యాధ్యాత్మిక పీఠాధిపతి, సద్గురువు డాక్టరు ఉమర్ ఆలీషా పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వాకలపూడి ఆశ్రమంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమర్ ఆలీషా, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత ఆశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటి, పక్షులకు ధాన్యపు కుచ్చులను వేలాడదీశారు. ర్యాలీకి వచ్చిన వారికి మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. ప్లాస్టిక్ నిరోధిస్తూనే ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటడం ద్వారా పంచభూతాలు కలుషితం కాకుండా చూడవచ్చని ఉద్బోధించారు. మరో అతిథి ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సేవలకు తాత్వికత జోడించి లక్షలాది సభ్యులను తీర్చిదిద్దుతున్నారని పీఠాధిపతిని అభినందించారు. అనంతరం చేపట్టిన ర్యాలీ బోట్‌క్లబ్ వద్ద ఉమర్ ఆలీషా చలివేంద్రం వరకు సాగింది. పర్యావరణ పరిరక్షణకు కాకినాడ లక్ష్మి, అనిశెట్టి సత్యవతి కీర్తన పాడి ఆకట్టుకున్నారు. ప్రగతి అకాడమిక్ డైరెక్టర్ రఘురామ్, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, మహేంద్రవర్మ, రెడ్డి సూర్యప్రభావతి పాల్గొన్నారు.

సాగర తీరాన.. సన్‌డే సమయాన



ఉప్పాడ సాగరతీరంలో పర్యాటకుల సందడి



బీచ్ రోడ్డులో నిలచిపోయిన వాహనాలను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ఎండవేడిమిని తట్టుకోలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఉప్పాడ సాగర తీరానికి భారీగా పర్యాటకులు తరలివచ్చి సేద తీరుతున్నారు. ఉప్పాడ తీర ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి భారీగా తరలివచ్చారు. యువత కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. పర్యాటకుల ఆటల పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. తలుపులమ్మతల్లి లోవను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి సాగర తీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.